డయేరియా నిర్మూలనకు సహకరించాలి


మండల టాస్క్ ఫోర్స్ సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి సంతోష్

గణపవరం: మారిన వాతావరణ పరిస్థితుల్లో డయేరియా వ్యాధి విజృంభిస్తుందని, దీని నివారణకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో డయేరియా నిర్మూలనకు సహకరించాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. బుధవారం గణపవరం మండల పరిషత్ సమావేశ మందిరంలో డయేరియా స్టాప్ అనే కార్యక్రమంపై మండల స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం ఎంపీడీఓ సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ డయేరియా వ్యాధిపై ప్రజలలో అవగాహన కల్పించాలని అన్నారు. జూన్‌నెల నుంచి ఆగస్టు వరకూ డయేరియా స్టాప్ అనే కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్ సిబ్బంది, అంగన్‌వాడి సిబ్బంది అన్ని గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రజలకు డయేరియా వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డయేరియా వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులంతా సహకరించాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారి పుచ్చల శేషు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల ఆరోగ్యభద్రతపై ఉపాధ్యాయులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య సిబ్బంది పాఠశాలల్లో చిన్నారులకు డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులను చేర్పించడానికి ఆయా గ్రామాలలో అధికారులు సహకరించాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాట్లాడుతూ అన్ని గ్రామాలలో క్లోరినేషన్ చేసిన నీటినే ప్రజలకు మంచినీటి పథకాల ద్వారా సరఫరా చేస్తున్నామని, ఓవర్‌హెడ్ ట్యాంకులను కూడా నెలకు రెండుసార్లు శుభ్రం చేసేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎంపీడీఓ సూర్యనారాయణ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో శానిటేషన్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అన్ని డ్రెయిన్‌లలో పూడిక తొలగించి, మురుగునీరు నిల్వలేకుండా చర్యలు తీసుకుంటున్నామని, గ్రామాల్లో రసాయనాలు పిచికారి చేస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో సీహెచ్‌ఓ జాలాది విల్సన్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు అధికారాలు కల్పించాలి


పల్లెం ప్రసాద్

దెందులూరు: జాతీయ, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు హైకోర్టు అధికారాలు కల్పించాలని రాజ్యసభ సభ్యుడు గొల్లబాబురావుకు వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, ఫారెస్ట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్ కోరారు. ఈ మేరకు లేఖను బుధవారం బాబురావుకు ఈ మెయిల్‌లో పంపారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు హైకోర్టు అధికారాలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వానికి సూచన చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్లు విశిష్ట అధికారాలు ఉంటేనే దేశంలో కోట్లాది మంది దళిత, గిరిజనులకు రక్షణ, న్యాయం, భద్రత, భవిష్యత్తు లభిస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపై కమిషన్లకు హైకోర్టు అధికారాలు ఇచ్చే వరకు దళితుల తరఫున అందరిని కలుపుకుని తన వంతు కృషి చేస్తానని ప్రసాద్ పేర్కొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై శుభశేఖర్

దెందులూరు: ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు వినియోగానికి దూరంగా ఉండాలని, ముఖ్యంగా యువత వాటి జోలికి వెళ్లవద్దని నూజివీడు డీఎస్పీ కె.లక్ష్మయ్య సూచించారు. బుధవారం గోపన్నపాలెం వ్యాయామ విద్యాకళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్ నత్తానియేలు అధ్యక్షతన పెదవేగి సీఐ కె.శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధక అవగాహన సమావేశం నిర్వహించారు. డీఎస్పీ లక్ష్మయ్య మాట్లాడుతూ యువత ప్రాథమిక స్థాయి నుంచి ఆధ్యాత్మిక చింతన, విద్య, సామాజిక సేవ, ఇతర రంగాలపై లక్ష్యాన్ని నిర్దేశించుకుని, వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. చెడు స్నేహాల జోలికి పోవద్దన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం విద్యార్థుల వ్యవహార శైలిని గమనించాలన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడితే ఆరోగ్యం, జీవితం పాడుకావడమే కాకుండా శిక్షలను సైతం ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు. ఎస్సైలు కె.స్వామి, రాజేంద్రప్రసాద్, వ్యాయామ కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.


కళాశాలలో మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మయ్య.

మాదక ద్రవ్యాల వినియోగంతో అనారోగ్యం

పెదపాడు : మాదక ద్రవ్యాల వినియోగం వ్యసనంగా మారితే జీవితాలను బలిగొంటాయని ఎస్సై శుభశేఖర్ హెచ్చరించారు. పెదపాడు జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిరోధంపై అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై శుభశేఖర్ మాట్లాడుతూ గంజాయి, తంబాకు, గుట్కా లు వంటిని వినియోగించడంతో అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి


భీమడోలు కళాశాల వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐలు బీబీ రవికుమార్, సత్యకుమారి

భీమడోలు: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భీమడోలు సీఐ బీబీ రవికుమార్, ఎస్ఈబీ సీఐ గిరిజా సత్యకుమారి అన్నారు. భీమడోలులో బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్, అబ్కారీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ విభాగాల యువతతో ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన రవికుమార్, సత్యకుమారి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం ద్వారా యువత బంగారు భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. డ్రగ్స్ మత్తులో యువత తమ జీవితాన్ని సర్వనాశనం చేసుకుంటుందన్నారు. దేశభవిష్యత్తును కుంగదీసే మాదక ద్రవ్యాలను నిరోధించేందుకు ప్రజలకు పోలీసులకు సహకరించాలన్నారు. అనంతరం భీమడోలు శ్రీవేంకటేశ్వర కళాశాల మీదుగా పురవీధుల్లో యువతీ యువకులు ప్లకార్డులను పట్టుకుని నినాదాలు చేస్తూ భీమడోలు జంక్షన్‌కు చేరుకున్నారు. అక్కడ మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వై.సుధాకర్, అబ్కారీ ఎస్సై జీవీ లక్ష్మీ, ఏఎస్సై వి.వెంకటేశ్వరరావు, కళాశాలల ప్రిన్సిపాల్స్ బొమ్మ రవికుమార్ డీబీబీ సింగ్, కోఆర్డినేటర్లు నాగరాజు, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

256 మందికి వైద్యపరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు గ్రామ శివారు ప్రాంత ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమని ఆదర్శరైతు వీరమాచనేని శివాజీ, దెందులూరు శ్రీరామదండు నాయకులు సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. బుధవారం దెందులూరు పుష్ప కల్యాణమండపంలో మాతృదేవో భవ ట్రస్టు, శ్రీరామదండు సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. 256 మందికి వైద్య సేవలందించారు. కళ్లు, దంతాలు, కీళ్ల నొప్పులు, బీపీ, షుగరు, కీళ్ల వ్యాధులు, వెన్నునొప్పి, కీళ్ల మార్పిడి వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో దెందులూరు నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు సహకారం అందించారు.

నేడు దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం

ఉంగుటూరు: మండలంలోని నారాయణపురం జిల్లాపరిషత్ హైస్కూలులో గురువారం దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని నిర్వహిస్తున్నారని, ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగంచేసుకోవాలని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి కోరారు. 18 సంవత్సరాలలోపు దివ్యాంగులైన బాలబాలికలకు ఈ శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిబిరంలో గుర్తించిన వారికే ఉపకరణాలు అందజేస్తారని ఎంపీపీ వివరించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిడమర్రు: నిడమర్రు, పెదనింద్రకొలను సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్న ట్రాన్స్‌కో డీఈ నటరాజన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సబ్ స్టేషన్ నిర్వహణ, లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పారిశుద్ధ్య కార్యక్రమాల పరిశీలన


అంబర్‌పేటలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలిస్తున్న ఈవోఆర్‌డీ సుందరి

భీమడోలు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీలు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని భీమడోలు ఈవోఆర్‌డీ సుందరి అన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా బుధవారం అంబర్‌పేట, పోలసానిపల్లి గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారులు తినే ముందు తిన్న తర్వాత చేతులు శుభ్రం చేసుకోనేలా తగిన శ్రద్ధ వహించాలని సిబ్బందికి ఆమె సూచించారు. గ్రామాల్లోని మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకు వద్ద నీటి నాణ్యతపై సిబ్బంది పరీక్షలు చేశారు. డ్రెయిన్స్‌లో నీరు నిల్వ లేకుండా చూడడం, పైపులైన్ లీకేజీ వల్ల నీరు కలుషితమయ్యే అవకాశాలున్నందున పంచాయతీలు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. వర్షాకాలం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ నెల 29 వరకు ప్రతి గ్రామ పంచాయతీల్లో విస్తృత స్థాయిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామకార్యదర్శులు వెంకట్రావు, జయరామకృష్ణ, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు


మల్కాపురంలో డ్రెయినేజీ పనులు పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ సరళకుమారి

ఏలూరు రూరల్ : గ్రామాల్లో డయేరియా నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు చేపట్టామని ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి అన్నారు. బుధవారం ఆమె మల్కాపురం, చాటపర్రు గ్రామాల్లో పర్యటించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 26 నుంచి 30 వరకు 15 పంచాయతీల్లో స్టాప్ డయేరియా కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజూ చెత్తా చెదారం, డ్రెయినేజీలో సిల్ట్ తొలిగింపు, రోడ్ల శుభ్రత, తాగునీరు శుభ్రత, పైలాన్ మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. తొలి రోజు ఉదయం 6 గంటల నుంచి పల్లె ప్రజలకు తాగునీరు అందించే ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రం చేయించామన్నారు. నీటి స్వచ్ఛత పెరిగేలా క్లోరినేషన్ చేశామని చెప్పారు. పారిశుద్ధ్యం సిబ్బందితో పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఖాళీ ప్రాంతాలు, రోడ్లు, డ్రెయినేజీ పరిసరాల్లో చెత్త తీసి బ్లీచింగ్ చల్లించామన్నారు.

ఘనంగా ఛత్రపతి సాహు మహారాజ్ జయంతి


సాహు మహారాజ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఛత్రపతి సాహు మహారాజ్ 150వ జయంతి కార్యక్రమాలను ఏలూరు నగరంలోని పలుచోట్ల బుధవారం ఘనంగా నిర్వహించారు. కర్రే అంబేడ్కర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో బీఎస్పీ నాయకులు నేతల రమేష్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వట్లూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద, బహుజన సమాజ్ పార్టీ కార్యాలయంలో జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. దేశంలో రిజర్వేషన్లు అమలు చేసిన తొలి అభ్యుదయ వాది, రిజర్వేషన్ల పితామహుడు అని కొనియాడారు. బాబాసాహెబ్ అంబేడ్కర్‌కి విదేశాల్లో విద్య నేర్చుకోవడానికి స్కాలర్ షిప్ అందించడమే కాకుండా ఆయన ప్రారంభించిన మూక్ నాయక్ పత్రిక నడపటానికి ఆర్థికంగా ఎంతో సహకారం అందించారన్నారు. మేతర అజయ్ బాబు మాట్లాడుతూ సాహు మహారాజ్ చేసిన సేవలను కొనియాడారు. అఖిల భారత తపాలా ఎస్సీ, ఎస్టీ, ఉద్యోగుల సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు దాసరి నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ భారత దేశంలో ఛత్రపతి సాహు మహారాజ్ తీసుకొచ్చిన సంస్కరణల వల్లే అందరికీ విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి బాబా సాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్ల విధానాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమాల్లో కొత్తల పూర్ణ మల్లికార్జున్, భూపతి అప్పారావు, కర్రి వేణుగోపాలరావు, కర్రే ప్రదీప్, పోపోలు రఘు, పిడిగే రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో అధ్వానంగా శానిటేషన్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో శానిటేషన్ పరిస్థితి అధ్వానంగా ఉందని, సూపర్‌వైజర్ల పని తీరు బాగోలేదని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏలూరు నగర పాలక సంస్థ పాత కౌన్సిల్ హాలులో పబ్లిక్ హెల్త్ విభాగం సమీక్షా సమావేశం మేయర్ షేక్ నూర్జహాన్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబుతో కలిసి ఆయన సమీక్షించారు. ఏలూరు కార్పొరేషన్ పరిధిలో పబ్లిక్ హెల్త్ విభాగంలోని పరిస్థితులపై ఆరా తీశారు. నగరంలో శానిటేషన్ అధ్వానంగా మారిందని, సిబ్బంది ఉన్నప్పటికీ పర్యవేక్షణ లోపంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించలేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిని మేయర్ నూర్జహాన్, పెదబాబు, కార్పొరేటర్లు భీమవరపు హేమసుందరి తదితరులు ఘనంగా సత్కరించారు.

15న జగన్నాథ రథ యాత్ర


జగన్నాథ రథ యాత్ర పోస్టర్ విడుదల చేసిన ఎమ్మెల్యే చంటి, పెదబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో జూలై 15వ తేదీన నిర్వహించే జగన్నాథ రథ యాత్రలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బడేటి చంటి పిలుపునిచ్చారు. బుధవారం చంటి క్యాంపు కార్యాలయంలో జగన్నాథ రథ యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ ఏలూరు నగరంలో రెండోసారి రథ యాత్ర నిర్వహించడానికి ఇస్కాన్ ప్రతినిధులు ఏర్పాటు చేయడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. ఇస్కాన్ ప్రతినిధి రాధా వల్లభ దాస్ మాట్లాడుతూ రథయాత్ర స్థానిక శనివారపు పేట రోడ్డులోని లునాని పార్కు వద్ద నుంచి మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమై ఆర్ఆర్‌పేట, మెయిన్ బజారు, ఫైర్ స్టేషన్ సెంటర్, పెద్ద వంతెన, వన్‌టౌన్, మెయిన్ బజారు మీదుగా తిరిగి రామకోటి వద్దకు చేరుకుంటుందన్నారు. రామకోటి ప్రాంగణంలో స్వామి వారికి పుష్పాభిషేకం, చప్పన్ భోగ నైవేద్యం, జగన్నాథ లీలా ప్రవచన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులందరికీ జగన్నాథ ప్రసాద వితరణ చేస్తామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, ఇస్కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం


వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ కరణం బుజ్జి

ఉంగుటూరు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని వైఎస్సార్ సీపీ మండలస్థాయి నాయకుడు, సొసైటీ త్రీమెన్ కమిటి మాజీ చైర్మన్ యెలిశెట్టి పాపారావు బాబ్జి అన్నారు. బుధవారం ఉంగుటూరు మండలం చేబ్రోలులో వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో బాబ్జి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు మనోధైర్యంతో ఉండాలని కోరారు. మాజీ సర్పంచ్ కరణం బుజ్జి మాట్లాడుతూ గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో రూ.300 కోట్లతో అభివృద్ధి చేశామని, అయితే ఓటమి చెందామని అన్నారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీను మరింత బలోపేతం చేసి, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తమవుదామని శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు రాయిలక్ష్మి, మనసాలనాగమణి, గ్రామ పార్టీ అధ్యక్షుడు ముత్తా బుజ్జి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల రాజా, నందారపు అప్పలరాజు, గేదల వినాయకరావు తదితరుల పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి


భవననిర్మాణ కార్మికుల జిల్లా సంఘం సమావేశంలో మాట్లాడుతున్న సోమసుందర్

గణపవరం: భవననిర్మాణ కార్మికులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను త్వరగా ఆచరణలోకి తీసుకురావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూసనపూడి సోమసుందర్ అన్నారు. బుధవారం గణపవరంలో జిల్లా భవన నిర్మాణ కార్మికుల సంఘం సమావేశం జిల్లా అధ్యక్షుడు బి.నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సోమసుందర్ మాట్లాడుతూ ఉచితంగా ఇసుక, కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరణ హామీలను తక్షణం అమలు చేయాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డాది రామకృష్ణ మాట్లాడుతూ కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి కార్మిక సంక్షేమ బోర్డును సాధించుకున్నారని అన్నారు. జిల్లా సంఘం కార్యదర్శి ఆదినారాయణరావు మాట్లాడుతూ కార్మికులంతా సంఘటితంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అందువల్ల అన్ని యూనియన్‌లు ఏకతాటిపైకి రావాలన్నారు.

వెల్లమిల్లిలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం


వెల్లమిల్లిలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఆయుర్వేద వైద్యం భారతీయ సంస్కృతీ సంప్రదాయాల్లో ఒకటి అని ఉంగుటూరు ఆయుర్వేద డాక్టరు శిరీష్, దెందులూరు ఆయుర్వేద డా, నగేష్‌లు అన్నారు. వెల్లమిల్లి పంచాయితీలో బుధవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో 120 మందికి వైద్య సేవలు అందించారు. ఆయుర్వేద ఆసుపత్రి సిబ్బంది కృష్ణకుమారి, ఎస్‌కే అంజాద్‌బేగ్, గోపి, మంగన్న పాల్గొన్నారు.

నేడు ఉంగుటూరులో వృద్ధుల వైద్య శిబిరం

ఉంగుటూరు గురువారం వృద్ధుల సమస్యలను తెలుసుకునేందుకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయుర్వేద ఆసుపత్రి డాక్టర్ శిరిష తెలిపారు. ఈ క్యాంపుల్లో ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. వృద్ధులకు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పిస్తారని వివరించారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స


చికిత్స పొందుతున్న చిన్నారిని పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి, వరప్రసాదరావు

ఏలూరు టౌన్: స్థానిక సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ భవనంలో తలసేమియా బాధిత చిన్నారులకు, సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు రక్తమార్పిడి చికిత్స అందిస్తూ వారికి అండగా ఉంటున్నామని ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి అన్నారు. రక్తమార్పిడి చికిత్స పొందుతున్న చిన్నారులను ఆయన పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సమాజంలో కొందరు పిల్లలు రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని, ఆరోగ్యంగా ఉన్న యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారిపోయి జీవితాన్ని నాశనం చేసుకోవటం బాధాకరమని తెలిపారు. మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని, జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. యువత డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కలిగి దూరంగా ఉండాలని కోరారు. బుధవారం రెడ్‌క్రాస్ భవనంలో తలసేమియా బాధిత చిన్నారులతోపాటు సహాయకులు 30 మందికి మానవత సభ్యులు టి.రామకృష్ణ ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సెక్రటరీ కేబీ సీతారాం, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాదరావు, గౌరవ కార్యదర్శి కడియాల కృష్ణారావు, డాక్టర్ జి.స్పందన, పీఆర్వో కేవీ రమణ, సిబ్బంది ఉన్నారు.

కేసుల దర్యాప్తులో అలసత్వం వద్దు

ఏలూరు టౌన్: పోలీస్ స్టేషన్‌కు వచ్చే మహిళల బాధలు, ఆవేదనను అర్థం చేసుకుని, వారికి న్యాయం చేయాలని, కేసుల దర్యాప్తులో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి హెచ్చరించారు. ఏలూరు వన్‌టౌన్ కోటదిబ్బ దిశ మహిళా పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దిశ స్టేషన్ హెల్ప్ డెస్క్ సేవలను పరిశీలించారు. మహిళా పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న మహిళలతో మాట్లాడారు. వారికి అందుతోన్న సేవలపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేశారు. కేసుల నమోదు, పరిష్కారం, నిందితుల అరెస్టులపై సీఐ విశ్వం, ఎస్సై క్రాంతిప్రియను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ ప్రాంగణాన్ని, అక్కడి పరిస్థితులను ఎస్పీ పరిశీలించారు. ప్రాంగణంలో పచ్చదనం, ఆహ్లాదకరమైన వాతావరణానికి మొక్కలు నాటాలని సూచించారు. ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ ఫిర్యాదు చేసేందుకు వచ్చే మహిళలతో మర్యాదగా వ్యవహరించాలని, ప్రతి సమస్యనూ హెల్ప్ డెస్క్‌లో నమోదు చేసి రశీదు ఇవ్వాలని ఆదేశించారు. కేసుల నమోదు, నిందితుల అరెస్టులు, కేసులకు సంబంధించి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు వంటి అంశాలపై పోలీస్ సిబ్బంది సరైన రీతిలో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

క్లుప్తంగా

శరవేగంగా చర్చి నిర్మాణ పనులు


సాల్వేషన్ ఆర్మీ చర్చి నిర్మాణం

దెందులూరు: దెందులూరులో సాల్వేషన్ ఆర్మీ చర్చి నిర్మాణ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. రిటైర్డ్ సౌత్ సెంట్రల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తనికొండ జీవరత్నం, సుందరమ్మ దంపతులు బుధవారం నిర్మాణ పనులను పరిశీలించారు. కోర్ ఆఫీసర్ మేజర్ కాకి రమణయ్య, రిటైర్డ్ కల్నల్ జోషియా, సంఘ పెద్ద కొంగర కిరణ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


పుస్తకాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

దెందులూరు: పోతునూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ తలారి ధన్యకుమార్, కొండేటి మోహన్, నున్నా లక్ష్మణ్‌బాబు, గండి రాజా, ఇప్పిలి వెంకటేశ్వరరావు, జక్కుల జాన్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారులంతా బడిలోనే ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీలత

దెందులూరు: బడిఈడు చిన్నారులంతా బడిలోనే ఉండాలని, 90 రోజుల బడికిపోదాం స్పెషల్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని ఎంపీడీఓ వి.శ్రీలత అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఈఓలు కె.అన్నమ్మ, ఏపీఎస్‌పీ ప్రసాద్ అన్ని పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీలత మాట్లాడుతూ ఏగ్రామంలోనూ చదువుతున్న చిన్నారులు, బడిఈడు చిన్నారులు, బడి బయట ఉండరాదని అన్నారు.

శ్మశాన వాటిక ఆధునికీకరణ పనులు


శ్మశానవాటిక ఆధునికీకరణ పనులు చేస్తున్న దృశ్యం

దెందులూరు: చల్లచింతలపూడిలో శ్మశాన వాటిక ఆక్రమణలకు గురికావడం, చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచనల మేరకు బుధవారం టీడీపీ నాయకులు జేసీబీతో ఆధునికీకరణ పనులు చేపట్టారు. వైఎస్సార్ సీపీ నేత, గ్రామ సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ, టీడీపీ నాయకులు నాగనబోయిన సత్యనారాయణ, ముమ్మిడి మోహనరావు, వేమన రాము, మోదుగమూడి రాంబాబుల నిధులతో ఈ పనులు చేశారు. గ్రామ కార్యదర్శి ఆనంద్ తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల నమోదుపై దృష్టి పెట్టాలి

లింగపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుపై దృష్టి పెట్టాలని మండల విద్యాశాఖ అధికారి కంట రామారావు ఉపాధ్యాయులకు సూచించారు. లింగపాలెం మండల విద్య వనరుల కేంద్రంలో బుధవారం ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఈఓలు ఇద్దరు పాల్గొని మాట్లాడారు. ఎన్‌రోల్‌మెంట్‌పై ఆర్‌జేడీ, డీఈవో జిల్లాలో పాఠశాలను సందర్శించడం జరుగుతుందని, ఇది గమనించి ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషిచేయాలని కోరారు. 90 రోజుల రోజువారి ప్రణాళికను ప్రతి ఒక్కరూ అమలు పరచాలని పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారి -2 జంగం రవీంద్ర మాట్లాడుతూ పాఠశాల విద్యా కమిటీల విషయంలో ప్రభుత్వం జీవో ఇచ్చే వరకు పాత విద్యా కమిటీలు కొనసాగుతాయని తెలిపారు. పాఠశాలకు సంబంధించి రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. డీఈవో సమక్షంలో స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ జరుగుతుందని, ఉపాధ్యాయులు గత ఐదేళ్ల 5 ప్లస్ డేటాతో పాటు ఇప్పటివరకు ఎన్ని అడ్మిషన్లు వచ్చినవో డేటాను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. నాడు నేడు పాఠశాలల్లో ఇంకా మిగిలి ఉన్న కాంపోనెంట్స్ అన్నీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఇప్పటివరకు నాడు-నేడు కింద సెలెక్ట్ అవ్వని పాత శాలలను గుర్తించి మూడో విడతలో ఆ పాఠశాలలను సెలెక్ట్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు సీఆర్‌పీలు పాల్గొన్నారు.